సాక్షి
కుమురం భీం
శనివారం ׀ 14 ׀ సెప్టెంబర్ ׀ 2024



పెరిగిన 'సన్నాల' సాగు
ఈ ఏడాది వాతావరణం పంటల సాగుకు అనుకూలంగా మారింది. జిల్లాలో చాలా మంది రైతులు సన్నరకం వరి సాగుకు ఆసక్తి చూపారు. 9లో▸



గణనాథులకు ప్రత్యేక పూజలు
జిల్లాలోని గణపతి మండపాల వద్ద ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. శుక్రవారం పలుచోట్ల మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
32.1 /24.0
వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

సైక్లింగ్ పోటీలకు డిగ్రీ విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థినులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలకు చెందిన 14 మంది విద్యార్థినులు రోడ్ సైక్లింగ్ ఉమెన్స్ లీగ్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ శారద తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను శుక్రవారం కళాశాల ఆవరణలో అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన రోడ్ సైక్లింగ్ ట్రయల్ పోటీల్లో పాల్గొన్న కళాశాలకు చెందిన 14 మంది విద్యార్థినులు సత్తా చాటినట్లు తెలిపారు. ఈ నెల 14న నిజామాబాద్‌లో ఖేలో ఇండియా, సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే సౌత్ జోనల్‌స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీ హారిక తదితరులు పాల్గొన్నారు.

మూడు కేజీబీవీలకు ప్రశంస



ప్రశంసాపత్రం అందుకుంటున్న మీనాకుమారి

ఆసిఫాబాద్‌రూరల్/ఆసిఫాబాద్: జిల్లాలో మూడు కస్తూరిబా బాలికల విద్యాలయాలు 2023- 24 విద్యాసంవత్సరంలో వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. ఈ నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లోని ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం వందశాతం ఫలితాలు సాధించిన కేజీబీవీలకు ప్రశంసాపత్రాలు అందించారు. కెరమెరి(మోడి) కేజీబీవీ ప్రత్యేకాధికారి మీనాకుమారి, సిర్పూర్(టి) కేజీబీవీ ప్రత్యేకాధికారి నాగసుధా, సిర్పూర్(యూ) కేజీబీవీ ప్రత్యేకాధికారి స్వప్న ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



బహుమతులు అందిస్తున్న ఎంఈవో భిక్షపతి, తదితరులు

కాగజ్‌నగర్‌రూరల్: ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన అవసరమని డీఈవో అశోక్ అన్నారు. పట్టణంలోని ఫాతిమా కాన్వెంట్ పాఠశాలలో ఎయిడ్స్ వ్యాధి, డ్రగ్స్‌పై శుక్రవారం జిల్లాలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో విద్యార్థులకు యుక్త వయస్సులో విపరీత ప్రవర్తన, తద్వారా కలిగే పరిణామాల గురించి వివరించారు. అనంతరం పోస్టర్ మేళా నిర్వహించారు. ఈ మేళాలో రెబ్బెన ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి శ్రీకాంత్ ప్రథమ బహుమతి, సిర్పూర్(టి)లోని ఈడెన్ గార్డెన్ పాఠశాల విద్యార్థిని జూహ అబ్దుల్ ముస్తకీం ద్వితీయ బహుమతి సాధించారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. న్యాయనిర్ణేతలుగా శాంతికుమార్, వాసుదేవ్ వ్యవహరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాం, క్లస్టర్ ప్రోగ్రామింగ్ మేనేజర్ నీలిమ, విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్, ఎంఈవో భిక్షపతి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి



రేషన్‌షాప్ తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్: చౌక ధరల దుకాణాల ద్వారా లబ్ధిదారులకు రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలని అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. కెరమెరి మండలం ధనోరా, గోయగాం గ్రామాల్లోని రేషన్ దుకాణాలను శుక్రవారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ డీలర్లు సమయపాలన పాటిస్తూ పూర్తిస్థాయిలో బియ్యం పంపిణీ పూర్తి చేయాలన్నారు. ధనోరాలో 253 మందికి 80 మంది కార్డుదారులకు, గోయగాం రేషన్ షాపులో 600 మందికి 150 మందికి బియ్యం అందించామని తెలిపారు.

'మహిళా శక్తి'తో ఆదాయాభివృద్ధి



- జిల్లాలో 22,748 యూనిట్ల ఏర్పాటే లక్ష్యం
- బ్యాంకు లింకేజీ కింద రూ.73.34 కోట్ల రుణాలందించాం
- 'సాక్షి'తో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బానోతు దత్తారావు



డీఆర్‌డీవో బానోతు దత్తారావు

సాక్షి, ఆసిఫాబాద్: 'రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. జిల్లావ్యాప్తంగా 15 మండలాల్లో 22,748 యూనిట్లను ఏర్పాటు చేయనున్నాం. వచ్చే నెలలో ఈ లక్ష్యాన్ని పూర్తి చేసే దిశగా యుద్ధ ప్రాతిపదికన పనిచేయాలని సిబ్బందికి ఆదేశిలిచ్చాం.' అని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి(డీఆర్‌డీవో) బానోతు దత్తారావు స్పష్టం చేశారు. ఆయా కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను శుక్రవారం 'సాక్షి'కి ఆయన వెల్లడించారు.

సాక్షి: ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద జిల్లాలో ఎన్ని యూనిట్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు? ఇప్పటివరకు ఎన్ని ఏర్పాటు చేశారు?

డీఆర్‌డీవో: ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద 14 రకాల ఆదాయాభివృద్ధి యూనిట్లను ఏర్పాటు చేయనున్నాం. మొత్తం 22,748 యూనిట్లు ఏర్పాటు చేయనున్నాం. ఇప్పటివరకు 7334 యూనిట్లు ఏర్పాటు చేశాం. మొత్తం యూనిట్ల ఏర్పాటు చేయడం ద్వారా 93,599 మందికి ఉపాధి కల్పించనున్నాం. వచ్చే నెలాఖరు వరకు లక్ష్యాన్ని పూర్తి చేసే విధంగా యుద్ధ ప్రాతిపదికన పనిచేయాలని సిబ్బందికి ఆదేశిలిచ్చాం.

సాక్షి: జిల్లాలో ఎన్ని సంఘాలు ఉన్నాయి? ఎన్ని కొత్త మహిళా సంఘాలు ఏర్పాటు చేశారు?

డీఆర్‌డీవో: జిల్లాలో 398 గ్రామ సంఘాలు, 8100 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. కొత్తగా 1942 సంఘాలు ఏర్పాటు చేయాలనే లక్ష్యం ఉండగా... ప్రస్తుతానికి 632 స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేశాం.

సాక్షి: బ్యాంక్ లింకేజీ రుణాల పంపిణీ ఎంతవరకు వచ్చింది?

డీఆర్‌డీవో: జిల్లాలో 2024- 25 ఆర్థిక సంవత్సరానికి బ్యాంక్ లింకేజీ కింద 6,769 సంఘాలకు రూ.227.48 కోట్ల మేర రుణాల పంపిణీ లక్ష్యం కాగా, ఇప్పటివరకు 1,278 సంఘాలకు రూ.73.34 కోట్ల మేరకు రుణాలు అందించాం. 32.24 శాతం లక్ష్యం పూర్తి కాగా.. వచ్చే ఏడాది మార్చి నాటికి వందశాతం లక్ష్యం చేరుకుంటాం.

సాక్షి: బ్యాంక్ లింకేజీలో జిల్లా 32 స్థానంలో ఉన్నట్లు తెలుస్తోంది? విధుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై శాఖాపరంగా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డీఆర్‌డీవో: బ్యాంక్ లింకేజీలో జిల్లా అట్టడుగు స్థానంలో ఉన్నది వాస్తవం. బ్యాంక్ లింకేజీలో నిర్లక్ష్యంగా ఉన్న 60 మంది సీసీలు, 11 మంది ఏపీఎంలకు అదనపు కలెక్టర్ దీపక్ తివారి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. లక్ష్యం పూర్తి చేయడానికి వచ్చే మూడు రోజుల సెలవు దినాలను పనిదినాలుగా భావించి పనిచేయాలని సిబ్బందికి ఆదేశాలిచ్చాం.

సాక్షి: ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలకు ఎన్ని లక్షల పనిదినాలు కల్పించారు? లక్ష్యం ఎంత?

డీఆర్‌డీవో: ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లావ్యాప్తంగా 92 వేల కుటుంబాలకు 41.61 లక్షల పని దినాలు కల్పించాలనే లక్ష్యం పెట్టుకున్నాం. ఇప్పటివరకు 74వేల కుటుంబాలకు 38.15 లక్షల పని దినాలు కల్పించాం. 91.7 శాతం లక్ష్యం పూర్తి చేశాం. వచ్చే ఏడాది మార్చి నాటికి మిగిలిన లక్ష్యానికి అనుగుణంగా పనులు కల్పిస్తాం.

పోషణ మాసం పకడ్బందీగా నిర్వహించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అధికారులు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: జిల్లాలో పోషణ మాసం పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. ఈ నెల 1 నుంచి 30 వరకు నిర్వహిస్తున్న పోషణ్ అభియాన్‌ను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోషణ్ అభియాన్‌లో భాగంగా పసిపిల్లలకు తల్లిపాల ప్రాముఖ్యత, మొదటి వెయ్యి రోజుల జీవన ప్రయాణం, అనుబంధ పోషకాహారం, పౌష్టికాహారం, న్యూట్రి గార్డెన్లు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మానసిక, శారీరక ఎదుగుదల తక్కువగా ఉన్న పిల్లలకు సకాలంలో పోషకాహారం, అవసరమైన మందులు అందించాలన్నారు. అదనపు ఆహారం తినిపించడంపైనా దృష్టి సారించాలన్నారు. మెనూ ప్రకారం గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, పిల్లలకు ఆహారం అందించాలని సూచించారు. జిల్లా, మండల అధికారులు తరచూ అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి మెనూ పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శామ్- మామ్ కార్యక్రమంలో ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొని వివరాలు నమోదు చేయాలన్నారు. రక్తహీనత ఉన్న బాలింతలు, గర్భిణుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హిమోగ్లోబిన్ కనీసం 12 గ్రాములు పైగా ఉండేలా మాత్రలు అందించాలన్నారు. అనంతరం పోషణ్ అభియాన్‌కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, డీఎంహెచ్‌వో తుకారాం భట్, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, డీఆర్‌డీవో దత్తారావు, జెడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

బోధన సిబ్బంది పోస్టుల భర్తీకి 20న ఇంటర్వ్యూలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యకళాశాలలో ఒప్పంద ప్రాతిపదికన బోధన సిబ్బంది పోస్టుల భర్తీకి ఈ నెల 20న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సతీశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఆరు ప్రొఫెసర్, 20 అసోసియేట్ ప్రొఫెసర్, 20 అసిస్టెంట్ ప్రొఫెసర్, 52 సీనియర్ రెసిడెంట్ పోస్టులు భర్తీ చేస్తామన్నారు. అర్హత ఉన్న అభ్యర్థులు విద్యార్హత, కులం, నివాస ధ్రువీకరణ పత్రాలతో మెడికల్ కళాశాలలో ఈ నెల 20న ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు https://gmckumurambheemasifabad.org ను సందర్శించాలన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ఆసిఫాబాద్ మున్సిపాలిటీ కార్మికులు ధర్నా నిర్వహించారు. అంతకు ముందు మున్సిపల్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. మున్సిపల్ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీకాంత్, అధ్యక్షుడు మాట్ల రాజు మాట్లాడుతూ ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు మూడు నెలల పెండింగ్ వేతనాలతోపాటు నాలుగు నెలల ఏరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25లోగా సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందించారు. నాయకులు సమ్మయ్య, బాబురావు, సురేశ్ తదితరులు ఉన్నారు.

ముసాయిదా ఓటరు జాబితా విడుదల

- జిల్లాలో 3,48,329 మంది గ్రామీణ ఓటర్లు
- ఈ నెల 14 నుంచి 21 వరకు అభ్యంతరాల స్వీకరణ
- 28న తుది జాబితా
- 'స్థానిక' పోరుకు ఎన్నికల సంఘం కసరత్తు



పెంచికల్‌పేట్‌లో ఓటరు జాబితా విడుదల చేస్తున్న ఎంపీడీవో అల్బర్ట్

ఆసిఫాబాద్: తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక పోరుకు కసరత్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా శుక్రవారం గ్రామ పంచాయతీల వారీగా ఎన్నికల ఓటరు ముసాయిదా తుది జాబితాను విడుదల చేసింది. జిల్లాలోని 335 గ్రామ పంచాయతీల పరిధిలో 3,48,329 మంది ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. వీరిలో 1,74,279 మంది పురుషులు, 1,74,034 మంది మహిళలు, 16 మంది ఇతరులు ఉన్నారు. మార్పులు చేర్పులతో కూడిన ఓటరు ముసాయిదా జాబితాను జిల్లాలోని అన్ని తహసీల్దార్, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించారు.

పెరిగిన ఓటర్లు

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం అర్హులైన యువతీ యువకులకు కొత్తగా ఓటరు నమోదుకు అవకాశం కల్పించింది. అర్హులైన వారు దరఖాస్తు చేసుకున్నారు. బూత్‌స్థాయి సర్వేలో భాగంగా మరణించిన, ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారి వివరాలను సైతం సేకరిస్తున్నారు. ప్రస్తుత ముసాయిదా జాబితాపై ఈ నెల 14 నుంచి 21 వరకు సంబంధిత పంచాయతీ కార్యదర్శి, మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు అభ్యంతరాలు తెలిపే అవకాశం కల్పించారు. ఈ నెల 26 వరకు పరిశీలించి ఈ నెల 28న తుది జాబితా ప్రచురిస్తామని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్ తెలిపారు. కాగా.. గత పంచాయతీ ఎన్నికలు నిర్వహించిన 2018 ఓటరు జాబితాతో పోలిస్తే ప్రస్తుతం జిల్లాలో 79,412 మంది ఓటర్లు పెరిగారు. గత పంచాయతీ ఎన్నికల సమయంలో జిల్లాలో 2,68,917 మంది ఓటర్లు ఉండగా, 1,36,074 మంది పురుషులు, 1,32,810 మంది మహిళలు, 33 మంది ఇతరులు ఉన్నారు. తాజాగా విడుదల చేసిన ముసాయిదాలో 3,48,329 మంది ఓటర్లు ఉన్నారు.

మండలాల వారీగా ఓటర్లు

మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
ఆసిఫాబాద్	14,743	14,957	0	29,700
బెజ్జూర్	11,608	11,878	2	23,488
చింతలమానెపల్లి	12,017	11,684	0	23,701
దహెగాం	10,858	10,892	0	21,750
జైనూర్	11,779	12,235	0	24,014
కాగజ్‌నగర్	22,387	21,720	2	44,109
కెరమెరి	11,984	11,665	1	23,650
కౌటాల	13,597	13,298	1	26,896
లింగాపూర్	5,018	5,359	0	10,377
పెంచికల్‌పేట్	6,231	6,044	0	12,275
రెబ్బెన	14,381	13,951	0	28,332
సిర్పూర్-టి	10,892	10,964	1	21,857
సిర్పూర్-యూ	5,748	6,326	2	12,076
తిర్యాణి	8,738	9,122	4	17,864
వాంకిడి	14,298	13,939	3	28,240
మొత్తం	1,74,279	1,74,034	16	3,48,329

చెరువుకు చేరని 'చేప'



రెబ్బెన మండలం నంబాల గ్రామానికి చెందిన బక్క పోషయ్య మత్స్య పారిశ్రామిక సొసైటీ సభ్యుడిగా కొనసాగుతున్నాడు. సొసైటీ ఆధ్వర్యంలో చేపలు పట్టుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. ప్రభుత్వం ఇప్పటివరకు ఉచితంగా పంపిణీ చేసే చేపపిల్లలను అందించకపోవటంతో సొసైటీ సభ్యులంతా కలిసి సొంత ఖర్చులతో చేప పిల్లలను కొనుగోలు చేశారు. గత నెలలోనే చెరువులు, కుంటల్లో వేసుకున్నారు.. ఇలా ఒక్క రెబ్బెనలోనే కాదు జిల్లాలో దాదాపు అన్ని మత్స్య పారిశ్రామిక సొసైటీ సభ్యులు తమకు కావాల్సిన చేపపిల్లలను సొంత డబ్బులతో కొనుగోలు చేసుకుంటున్నారు.



టెండర్లు తెరుస్తున్న అదనపు కలెక్టర్ దాసరి వేణు, అధికారులు (ఫైల్)

- బుధవారం టెండర్లు తెరిచిన జిల్లా అధికారులు
- ఈ నెలాఖరులోగా పంపిణీ చేసేందుకు సన్నాహాలు
- అదును దాటుతుండటంతో మత్స్యకారుల్లో ఆందోళన
- సొంతంగా కొనుగోలు చేసుకుంటున్న వైనం..
- అధిక వర్షాలతో వరదలో కొట్టుకుపోతున్న చేపపిల్లలు

రెబ్బెన(ఆసిఫాబాద్): మత్స్యకారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసే చేపపిల్లలు ఇంకా చెరువుకు చేరుకోలేదు. వర్షాకాలం ప్రారంభమై మూడు నెలలు గడిచినా చేపపిల్లలు అందకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. అదును దాటిన తర్వాత పంపిణీ చేస్తే అవి ఎదిగేందుకు సమయం లేక నష్టపోయే ప్రమాదం ఉంది. జిల్లాలో భారీ ప్రాజెక్టులు లేకపోవటంతో చేపల వేటపై ఆధారపడి జీవించే మత్స్యకారులు చెరువులు, కుంటల్లోనే చేప పిల్లలు పెంచుకుంటున్నారు. ప్రభుత్వం ఆలస్యంగా చేపపిల్లలు అందజేస్తుండటంతో కుంటలు, చెరువుల్లో వాటి ఎదుగుదల అంతంత మాత్రంగానే ఉంటోంది. అలాగే చిన్న సైజు చేపపిల్లలు అందిస్తుండటంతో సీజన్ చివరి నాటికి కుంటలు, చెరువుల్లో నీరు ఇంకిపోయి కొంగలు, ఇతర పక్షులకు ఆహారంగా మారుతున్నాయి.

సొంతంగా కొనుగోలు

15 మండలాల పరిధిలో 60 మత్స్య పారిశ్రామిక సంఘాలు ఉండగా.. సుమారు 4500 మంది సభ్యులు ఉన్నారు. సొసైటీల ఆధ్వర్యంలో చేప పిల్లలను పెంచి సభ్యులందరూ జీవనోపాధి పొందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధి కోసం ఏటా ఉచితంగా చేపపిల్లలు పంపిణీ చేస్తోంది. ప్రక్రియలో జాప్యం కావడం, చిన్నసైజు చేప పిల్లలు అందిస్తుండటంతో మత్స్యకారులు సొంత డబ్బులతో చేపపిల్లలు కొనుగోలు చేసి చెరువులు, కుంటల్లో వేసుకుంటున్నారు. జగిత్యాల, ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి, కైకలూరు, మహారాష్ట్రలోని అహేరి, ఛత్తీస్‌గఢ్ వంటి ప్రాంతాల నుంచి చేపపిల్లలు తెచ్చుకుంటున్నారు. 3 నుంచి 4 ఇంచుల పొడవైన ఒక్క పిల్లకు రూ.4, అలాగే 2 నుంచి 3 ఇంచుల ఉండేవాటికి రూ.2 చొప్పున చెల్లిస్తున్నారు. గత నెలలో వదిలినవి రానున్న 4 నెలల్లో ఒక్కో చేప సుమారు కిలో నుంచి రెండు కిలోల వరకు బరువు పెరిగే అవకాశం ఉంటుందని మత్స్యకారులు అంచనా వేస్తున్నారు.

అధిక వర్షాలతో ఉపాధికి దెబ్బ

కొన్ని రోజులుగా జిల్లాలో కురుస్తున్న అధిక వర్షాలు మత్స్యకారుల జీవనోపాధికి అడ్డంకిగా మారుతున్నాయి. గత నెలలోనే మత్స్యకారులు సొంత డబ్బులతో చేపపిల్లలు కొనుగోలు చేశారు. అధిక వర్షాలకు చెరువులు, కుంటలు నిండుకుండలా మారి అలుగు పారడంతో చేప పిల్లలు ప్రవాహంతోపాటు బయటకు వెళ్లిపోతున్నాయి. కనీసం ప్రభుత్వం పంపిణీ చేసే ఉచిత చేపపిల్లలైనా సకాలంలో అందిస్తే అధిక వర్షాలతో కలిగిన నష్టం భర్తీ అవుతుందని భావించిన మత్స్యకారులకు అధికారుల తీరు నిరాశే కలిగిస్తోంది.

నత్తనడకన ప్రక్రియ

గతేడాది మాదిరిగానే ఈసారి సైతం జిల్లాలో ఉచిత చేప పిల్లల పంపిణీ ప్రక్రియలో తీవ్ర జాప్యం ఏర్పడుతోంది. జిల్లాలోని 15 మండలాల పరిధిలో 10,948 హెక్టార్ల జలాశయాల్లో ఈ ఆర్థిక సంవత్సరంలో 1.35 కోట్ల చేప పిల్లలు పంపిణీ చేయాలని అధికారులు లక్ష్యం పెట్టుకున్నారు. చేపపిల్లల కోసం అధికారులు టెండర్లు పిలవగా.. కేవలం నాలుగు టెండర్లు దాఖలయ్యాయి. అయితే మత్స్యశాఖ అధికారులు టెండర్లను పరిశీలించి ఇద్దరిని అనర్హులుగా తేల్చారు. ఇక మిగిలిన రెండు టెండర్లను బుధవారం తెరిచారు. ఇందులో అర్హులైన వారికి అనుమతులు మంజూరు చేయనున్నారు. ఈ నెల చివరి వారంలో.. లేదా వచ్చే నెల మొదటి వారంలో చేప పిల్లలను పంపిణీ చేసేందుకు కార్యాచరణ చేస్తున్నారు. కొన్ని రోజులుగా జిల్లాలో కురుస్తున్న అధిక వర్షాలతో ఉచిత చేప పిల్లల పంపిణీ ప్రక్రియ జాప్యానికి కారణం అవుతోందని అధికారులు చెప్పుకొస్తున్నారు. అయితే అదును దాటిన తర్వాత పంపిణీ చేస్తే ఏం ప్రయోజనమని మత్స్యకారులు ప్రశ్నిస్తున్నారు.

నెలాఖరులోగా పంపిణీ

ఉచిత చేప పిల్లల పంపిణీకి టెండర్లు పిలవగా నలుగురు టెండర్లు దాఖలు చేశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా లేని రెండు టెండర్లను తిరస్కరించాం. ఈనెలాఖరులోగా అన్ని మండలాలకు చేపపిల్లలు పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో ఇటీవల కురుస్తున్న అధిక వర్షాలు సైతం దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగుతున్నాం.
– సాంబశివరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి

ప్రజాపాలన దినోత్సవానికి ఏర్పాట్లు

ఆసిఫాబాద్: జిల్లాలో ఈ నెల 17న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, డీఆర్వో లోకేశ్వర్‌రావుతో కలిసి శుక్రవారం వేడుకలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమం ఏర్పాట్లను అదనపు కలెక్టర్(రెవెన్యూ), మినట్ టు మినట్ పతాకావిష్కరణ కార్యక్రమాల నిర్వహణ ఎస్పీ, ఆహ్వాన పత్రికల ముద్రణ, పంపిణీ ప్రక్రియ డీఆర్వో, ఆసిఫాబాద్ తహసీల్దార్, కలెక్టరేట్ ఏవోలు సమన్వయంతో నిర్వహించాలన్నారు. అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో పతాకావిష్కరణ కార్యక్రమాలు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, రోడ్లు భవనాల శాఖ డిప్యూటీ ఈఈ ఆధ్వర్యంలో వేదిక, టెంట్, కుర్చీలు, సౌండ్ సిస్టం, మైక్ ఏర్పాట్లు, ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో వేదిక, పోడియం అలంకరణ, జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో వీడియోగ్రఫీ, మీడియా నిర్వహణ, ఆర్డీవో, ఆసిఫాబాద్ తహసీల్దార్ల సమన్వయంతో వేడుకలకు హాజరయ్యే ప్రముఖులు, ప్రజలు కూర్చునేందుకు కుర్చీల ఏర్పాటు, ప్రోటోకాల్ నిర్వహణ, జిల్లా పౌరసరఫరాలు, గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో టీ, స్నాక్స్, బిస్కెట్స్ ప్యాకెట్ల పంపిణీ, సీపీవో, పౌరసంబంధాల శాఖ అధికారి ఆధ్వర్యంలో అభివృద్ధి నివేదిక ప్రతి తయారు, ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్, డీపీవో ఆధ్వర్యంలో పారిశుధ్యం, మిషన్ భగీరథ ఈఈ ఆధ్వర్యంలో తాగునీరు, విద్యాశాఖ ఆధ్వర్యంలో యాంకర్ ఎంపిక, విద్యుత్ శాఖ ఎస్ఈ ఆధ్వర్యంలో నిరంతర విద్యుత్ సరఫరా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో సభా ప్రాంగణాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు.



కలెక్టరేట్ ఆవరణలో సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అధికారులు

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన వేదాంత్‌తో ప్రిన్సిపాల్, పీడీ

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలోని సెయింట్ మేరీ పాఠశాలకు చెందిన వేదంత్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఆసిఫాబాద్‌లో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో వేదంత్ ప్రతిభ కనబర్చాడు. ఎంపికైన విద్యార్థిని ప్రిన్సిపాల్ లిబిన్, పీడీ రాకేశ్ శుక్రవారం అభినందించారు. హన్మకొండలో ఈనెల 14 నుంచి 16 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వేదంత్ పాల్గొంటారని వివరించారు. పీఈటీ కిరణ్, అర్చన, బధ్రి ఉన్నారు.

ఒకరి ఆత్మహత్యాయత్నం

ఉట్నూర్‌రూరల్: పెట్రోల్ పోసుకొని ఒంటికి నిప్పంటించుకొని ఒకరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఉట్నూర్ మండల కేంద్రంలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై మనోహర్ కథనం ప్రకారం..మండల కేంద్రంలోని పుకట్‌నగర్ కాలనీకి చెందిన మల్లేశ్ ఎంఎల్ఎస్ పాయింట్‌లో హమాలీగా పని చేస్తున్నాడు. కుటుంబ కలహాలతో శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. గమనించిన స్థానికులు మంటలార్పి వేసి ఆటోలో ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు రెఫర్ చేశారు. కాగా, ఎస్సైని వివరణ కోరగా పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

సోన్: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. శుక్రవారం డీఎస్పీ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. మండలంలోని కడ్తాల్ ఎక్స్‌రోడ్డు వద్ద బైక్‌పై అనుమానస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు తనిఖీ చేశారు. 1100 గ్రాముల గంజాయి లభించింది. నిర్మల్ జిల్లా సోఫీనగర్‌కు చెందిన లక్ష్మణ్‌గా గుర్తించారు. గతంలో పలు దొంగతనాల కేసుల్లో ఉన్నారని తెలిపారు. నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సోన్ పోలీసులను డీఎస్పీ అభినందించారు. సీఐ నవీన్‌కుమార్, ఎస్సై కె.గోపి, పోలీసులు ఉన్నారు.

సీఎస్సీ హెల్త్‌కేర్‌లో ఉద్యోగావకాశాలు

మంచిర్యాలటౌన్: జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల వారీగా సీఎస్సీ హెల్త్‌కేర్‌లో నియామకాలు చేపడుతున్నట్లు సీఎస్సీ స్టేట్ మేనేజర్ సురేశ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్టీ, డీఎమ్మెల్టీ, బీఎస్సీ ఎమ్మెల్టీ, ఏఎన్ఎం, జీఎన్ఎం అభ్యర్థులు సంబంధిత కోర్సులో పారామెడికల్ బోర్డులో రిజిష్టర్ చేసుకుని ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 15న ఉదయం 9గంటల నుంచి 4గంటల వరకు మంచిర్యాలలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు జిల్లా కోఆర్డినేటర్ కొండల్‌రావును 9989165691, డివిజనల్ మేనేజర్ శ్రీనివాస్ 8977776143 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

యువత ఆర్థికంగా ఎదగాలి


ఉట్నూర్‌రూరల్: యువత ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌సెటీ) డైరెక్టర్ ఎండీ గౌస్ అన్నారు. ఆర్‌సెటీలో బైక్ రిపేర్ శిక్షణ తీసుకున్న 30 మంది యువకులతో ఉట్నూర్ ఐబీలో శుక్రవారం ఉచిత బైక్‌ల సర్వీసింగ్ క్యాంపు నిర్వహించారు. శిక్షకులు ఎండీ షకీల్ ఉన్నారు.

జాతీయ సమైక్య భాష హిందీ

- జాతీయభాషగా గుర్తింపు
- భిన్న సంస్కృతుల వారధి హిందీ
- నేడు 'జాతీయ హిందీ దివస్'



నిర్మల్‌ఖిల్లా: భారతదేశం వివిధ సంస్కృతులు, విభిన్న భాషలు, నాగరికతలకు నెలవు. ప్రతీ రాష్ట్రానికి ప్రాంతీయ భాష ఉంటుంది. కొన్ని గిరిజన ప్రాంతాలకు వెళ్తే భాష మరోలా ఉంటుంది. ఆయా వర్గాల వారు మరొకరితో మాట్లాడుకునేందుకే అనుసంధానంగా వ్యవహరించేది భాష. దీని ద్వారా మరో వ్యక్తికి మనం చెప్పాలనుకునేది చేరుతుంది. దేశంలో అత్యధికుల నోళ్లలో నానే మాట, భిన్న సంస్కృతుల వారధి..కేంద్ర అధికారిక హోదా అందుకున్న భాష హిందీ. 1949లో భారత రాజ్యాంగ సభ హిందీని జాతీయ అధికారిక భాషగా గుర్తించింది. అప్పటి నుంచి ప్రతీఏటా సెప్టెంబర్ 14న 'హిందీ దివస్'గా జరుపుకొంటున్నారు.



పదో తరగతి హిందీపుస్తకంలో నీటిప్రాధాన్యతను తెలిపే పాఠ్యాంశం

ఈ నేపథ్యంలో సాక్షి కథనం.

సాహితీవేత్తలు సైతం

హిందీభాషలో సూరదాసు సూర్యుడిగా, తులసీదాసు చంద్రుడిగా గుర్తింపు పొందారు. వీరు రాసిన సూర్‌సాగర్, రామచరితమానస్‌లు జీవగ్రంథాలుగా పేరుపొందాయి. మీరాబాయి కృష్ణుని భక్తిలో లీనమై రాసిన భజన పాటలు పదావళిలో ఉన్నాయి. సమాజంలోని దురాచారాలను తొలగించడానికి హిందీ ప్రజాకవి కబీర్‌దాస్ తోడ్పడ్డారు.

హిందీ నేపథ్యం..

- పర్షియన్ పదం 'హింద్ 'నుంచి హిందీ పుట్టుకొచ్చింది. ఇండస్ నదీ పారుతున్న నేలలో మాట్లాడే భాష అని దీని అర్థం. కేంద్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించిన రెండు భాషల్లో హిందీ ఒకటి. ఇది దేవనాగరి లిపిలో ఉంటుంది. దేశంలో అత్యధికులు మాట్లాడే భాష హిందీ.
- ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే భాషల్లో నాలుగోస్థానంలో ఉంది. భారత్‌లోనే కాదు.. పాకిస్థాన్, నేపాల్, బంగ్లాదేశ్, అమెరికా, ఇంగ్లండ్, జర్మనీ, న్యూజిలాండ్, యూఏఈ, ఉగాండా, గయానా, సురినామ్, ట్రినిడాడ్, మారిషస్, దక్షిణాఫ్రికాల్లో హిందీని జనం గణనీయ సంఖ్యలో మాట్లాడుతారు.
- కవులు, రచయితలు కాకా కాలేల్కర్, మైథిలీ శరణ్ గుప్తా, హజారీ ప్రసాద్ ద్వివేదీ, సేథ్ గోవింద్ దాస్, బియోహర్ రాజేంద్ర సింహా.. హిందీ అధికారిక భాషగా గుర్తింపు పొందడంలో విశేష కృషి చేశారు.
- 1949 సెప్టెంబరు 14న రాజ్యాంగంలోని 351వ అధికరణం 8వ షెడ్యూల్‌లో హిందీని జాతీయభాషగా గుర్తిస్తూ ఆ రోజుల్లో పొందుపర్చారు.

భిన్న సంస్కృతులకు నిలయం



భారతదేశం..వివిధ భాషలు భిన్న సంస్కృతులకు నిలయం. భారతీయులందరినీ ఏకతాటిపైకి తెచ్చిన భాష హిందీ. ప్రస్తుతం భారతీయ అధికార భాషగా గుర్తింపు పొందింది.

– ముత్యాల వాణి, హిందీ ఉపాధ్యాయురాలు

సంస్కృతిని ప్రతిబింబించే భాష



హిందీ భాష భారతీయ సంస్కృతిని ఇనుమడింపజేస్తుంది. హిందీలో నీతి కథలు, దోహా పద్యాలు విద్యార్థులకు పరిచయంతోనే భారతీయ సంప్రదాయాలు అవగతం అవుతాయి. పాఠశాల స్థాయి నుంచే హిందీపై అభిరుచిని పెంపొందించాలి.

– ఎం.సుందల్‌సింగ్, ఎస్ఏ, హిందీ, పరిమండల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

హిందీభాష వారసత్వ సంపద



హిందీ భాష భారతీయులందరి వారసత్వ సంపద లాంటిది. స్వాతంత్రోద్యమ కాలం నుంచి ఈ భాషకు ప్రాముఖ్యత ఉంది. హిందీ భాషాభివృద్ధికి విద్యార్థి దశ నుంచే ప్రోత్సాహం ఉండాలి.

– డా.అఖిలేశ్ కుమార్‌సింగ్, హిందీ భాషానిపుణుడు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్: కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు శుక్రవారం ఎస్సార్పీ 3, 3ఏ గనిని సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య ముస్కే సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీ సైదా మాట్లాడారు. మ్యాన్‌రైడింగ్ చైర్స్ రబ్బర్స్ సరిపడా లేకపోవడంతో చైర్స్‌ను తక్కువ పెట్టి నడిపిస్తున్నారని తెలిపారు. గనిపై ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరిఫైడ్ సక్రమంగా పని చేయడం లేదన్నారు. ఆయా సమస్యలను వారు గని మేనేజర్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. యూనియన్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఫిట్ కార్యదర్శి మురళీ చౌదరి, అంబాల రవి, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, నాయకులు రోమోజీ, కాజీపేట విక్కి, ఆడెపు సురేశ్ ఉన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నేతలు

నిరంతర సాధనతో క్రీడానైపుణ్యాలు మెరుగు

రెబ్బెన: క్రీడాకారులు నిరంతర సాధనతోనే క్రీడానైపుణ్యాలు మెరుగుపర్చుకోవచ్చునని బెల్లంపల్లి ఏరియా ఇంజినీర్ భీంరావు జాడే అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్‌షిప్‌లో శుక్రవారం డబ్ల్యూపీఎస్ వార్షిక క్రీడల్లో భాగంగా బెల్లంపల్లి, మందమర్రి ఏరియాల నియర్ బై ఏరియా టెన్నీస్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ప్రతి ఏరియాలో క్రీడాకారులకు కావల్సిన అన్ని వసతులు కల్పించి ప్రోత్సహిస్తోందన్నారు. క్రీడాకారులందరూ ఆటల్లో రాణించాలన్నారు. బెల్లంపల్లి, మందమర్రి ఏరియాకు చెందిన క్రీడాకారులు కంపెనీ స్థాయి క్రీడాపోటీలకు ఎంపికై పతకాలు సాధించాలన్నారు. ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, సీనియర్ పీవో ప్రశాంత్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, బెల్లంపల్లి ఏరియా స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కిరణ్, జనరల్ కెప్టెన్ చంద్రకుమార్ పాల్గొన్నారు.



టెన్నీస్ పోటీలు ప్రారంభిస్తున్న భీంరావు జాడే

పవర్ ప్లాంటు నుంచి ఆగిన దుమ్ము ధూళి

జైపూర్: జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు నుంచి వస్తున్న దుమ్ముధూళి ఆగిందని ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యూనిట్–2 క్యాపిటల్ ఓవర్‌హాలింగ్‌లో భాగంగా 84 రోజులు మరమ్మతు చేపట్టి ఆయిల్‌తో లైటాప్ చేయడంతో రెండు గంటలు దుమ్ము ధూళి వచ్చిందన్నారు. తర్వాత అది ఆగిందని తెలిపారు. సోషల్ మీడియాలో ప్లాంటు నుంచి దుమ్ము ధూళి వస్తుందని ప్రచారం జరిగిందన్నారు. ఈనెల 9న అధికారులు చుట్టుపక్కల గ్రామాలు, ఎస్టీపీపీ పరిసర ప్రాంతాల్లో ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ పరికరం పీఎం 10 ద్వారా మానిటర్ చేసి రిపోర్ట్ ఇచ్చారని తెలిపారు. ప్లాంటు నుంచి వెలువడుతున్న దుమ్ము ఎన్ఏఏక్యూఎస్ ప్రకారం నియమ నిబంధనలకు లోబడి ఉందని తెలిపారు. ఎలాంటి విషవాయివులు, కానీ వ్యర్థాలు కానీ వెలువడం లేదని పేర్కొన్నారు.



ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావు

సీఎస్పీలో దళారీ మోసం

- గిరిజన మహిళ వేలిముద్రతో రూ.30 వేలు డ్రా
- కుమారుడి సెల్‌ఫోన్‌కు సందేశం
- బ్యాంకు అధికారులను సంప్రదిస్తే విషయం వెలుగులోకి
- దళారీని చితకబాదిన బాధితురాలి కుమారుడు



మాడవి జంగుబాయి

నార్నూర్: గిరిజన మహిళను దళారీ మోసం చేసిన ఘటన నార్నూర్ మండల కేంద్రంలోని సీఎస్పీ సెంటర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గాదిగూడ మండలం రాంపూర్‌కు చెందిన మాడవి జంగుబాయికి రూ.1.30 లక్షల పంట రుణమాఫీ అయింది. రుణమాఫీ డబ్బుల్లో నార్నూర్ ఎస్బీఐలో ఆమె ఖాతాలో రూ.50 వేలు డిపాజిట్ చేసింది. మిగతా రూ.80 వేలకుగాను రూ.50 వేలు డ్రా చేసింది. మధ్యవర్తిగా ఉన్న దళారీ పెందూర్ ప్రభాకర్ ఆమెకు బ్యాంక్ వోచర్ నింపడం, డ్రా చేయడం చేశాడు. డబ్బులు చెక్‌చేద్దామని ప్రభాకర్ ఆమెను నార్నూర్‌లోని సీఎస్పీ కేంద్రానికి తీసుకెళ్లాడు. ప్రభాకర్, నిర్వాహకుడు రవీందర్‌తో ఆమె ఆధార్ కార్డు, వేలిముద్రతో రూ.30 వేలు డ్రా చేశాడు. తర్వాత డబ్బులు జమ కాలేదని నిర్వాహకుడు చెప్పడంతో తిరిగివెళ్లింది. డబ్బులు డ్రా అయినట్లు ఆమె కుమారుడి సెల్‌ఫోన్‌కు మేసెజ్ వచ్చింది. అతను వెంటనే బ్యాంక్ అధికారులను సంప్రదిస్తే అసలు విషయం తెలిసింది. ఆగ్రహానికి గురైన కుమారుడు..దళారీ అయిన ప్రభాకర్‌ను చితకబాదాడు.నిర్వాహకుడు రవీందర్ బాధిత మహిళకు రూ.30 వేలు అందించాడు. ఈ విషయం బయటకు పొక్కకుండా సర్దుబాటు చేసినట్లు సమాచారం.



ప్రభాకర్‌ను చితకబాదుతున్న బాధిత మహిళ కుమారుడు

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి

సోన్: మండలంలోని గంజాల్ టోల్‌ప్లాజా వద్ద గురువారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతిచెందాడు. ఎస్సై కే.గోపి కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా డొంకేశ్వర్ మండలం గంగాసముందర్‌కు చెందిన జక్కుల రాకేశ్(29) తన అత్తగారింటికి వెళ్లేందుకు ముప్కాలకు బయల్దేరాడు. అక్కడి నుంచి నిర్మల్‌కు బస్సులో వెళ్లాడు. మార్గమధ్యలో గంజాల్ టోల్‌ప్లాజా వద్ద బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తమ్ముడు మల్లేశ్ ఫిర్యాదుతో శుక్రవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జైపూర్: మండలంలోని ఇందారం సమీపంలో టేకుమట్ల క్రాస్‌రోడ్డు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి..గోదావరిఖని నుంచి శ్రీరాంపూర్ వైపు వెళ్తున్న లారీని అటువైపు వెళ్తున్న కారు వెనుక భాగం నుంచి వేగంగా ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. కారులో ఉన్న హైదరాబాద్‌కు చెందిన పూసపాటి ఆనంద్ తలకు తీవ్రంగా, మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో మంచిర్యాల ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు.

ఇంద్రవెల్లి మండలంలో యువకుడికి..



వెంకటిని రిమ్స్‌కు తరలిస్తున్న సిబ్బంది

ఇంద్రవెల్లి: మండలంలోని ముత్నూర్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు.. కేస్లాపూర్ పంచాయతీ పరిధిలోని కేస్లాగూడ(జి) గ్రామానికి చెందిన హెరేకుంర వెంకటి సొంత పని నిమిత్తం బైక్‌పై ముత్నూర్ వెళ్లి తిరిగివస్తున్నాడు. ఈ క్రమంలో ప్రధాన రహదారిపై భగీరథ పైప్‌లైన్ కోసం తవ్విన గుంత వద్ద కారు డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. వెనుక నుంచి బైక్ వేగంగా వచ్చి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకటిని స్థానికులు అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు. వెంకటి పరిస్థితి విషమంగా ఉందని కుటుంబీకులు తెలిపారు.

కోతులదాడిలో వృద్ధురాలికి..

నర్సాపూర్(జి): కోతుల దాడిలో మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు గూండ్ల నాగమ్మ (65) గాయపడింది. ఒకరి ఇంట్లో పని చేస్తుండగా శుక్రవారం కోతులు మూకుమ్మడి దాడిలో ఆమె కాలికి గాయమైంది. కుటుంబ సభ్యులు ఆమెను స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లారు. మండల కేంద్రంలో కోతుల బెడద అరికట్టేలా అటవీ అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆదిలాబాద్‌లో ఏబీఆర్ఎస్ఎం బృందం పర్యటన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బృందం సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: అఖిల భారతీయ మహా సంఘ్ బృందం సభ్యులు జిల్లా పర్యటనకు వచ్చారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్, సైన్స్ డిగ్రీ కళాశాల, సంజయ్ గాంధీ తదితర కళాశాలలను శుక్రవారం సందర్శించారు. ఈనెల 21న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో నవ భారత నిర్మాణంలో మహిళా 'విద్యావేత్తల పాత్ర'అనే అంశంపై కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదయ్య తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌కు జిల్లా నుంచి మహిళా లెక్చరర్లు హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. వసంత గౌరి, శ్రీనివాస్, సరిత రాణి, నాగరాజు పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలతో సామాజిక న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న ఉపాలి

ఖానాపూర్: తెలంగాణలో సామాజిక న్యాయం సమరశీల పోరాటాలతోనే సాధ్యమని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ఆర్.ఉపాలి అన్నారు. పట్టణంలోని తాపీమేస్త్రీ సంఘ భవనంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో నైజాం నిరంకుశ పాలన అంతమైనయా దోపిడీ సాగుతోందని విమర్శించారు. వీరుల త్యాగాలను విస్మరించిన ప్రభుత్వం విలీన దినానికి ఎగనామం పెట్టిందన్నారు. సామాజిక న్యాయం జరగాలంటే సమరశీల పోరాటాలే సరైన మార్గమని పేర్కొన్నారు. శనివారం పట్టణంలో సీపీఐ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కడుకుంట్ల రవి, చిలుకూరి ఇస్తారి, అంకం శంకర్, పిట్టల భీమేశ్, చిన్న భీమేశ్, పాషా తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలటౌన్: వివిధ రంగాల్లో మైనార్టీలకు వృత్తి శిక్షణ ఇచ్చి ఉద్యోగ కల్పన కోసం వృత్తి శిక్షణ సంస్థల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీలకు ఐటీ, ఎడ్యుకేషన్, హెల్త్, అకౌంటింగ్, కన్‌స్ట్రక్షన్, వెటర్నరీ–డెయిరీ, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, హార్టికల్చర్ తదితర శిక్షణకు భాగస్వాములుగా నియమిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల సంస్థలు దరఖాస్తులను హైదరాబాద్–నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయంలో అక్టోబర్ 4న సాయంత్రం 5 గంటల్లో సమర్పించాలని తెలిపారు. వివరాలకు నస్పూరులోని కలెక్టరేట్‌లో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చేస్తారా..?



గెర్రె కాలనీలో గుర్తించిన అక్రమ నిర్మాణాలు

- కలెక్టర్ ఆగ్రహంతో నోటీసులు జారీ
- మిగతా సర్వే నంబర్ల సంగతి ఏమిటి..?

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని 840 సర్వేనంబరు గెర్రెకాలనీ ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించిన షెడ్లు, ఇళ్లకు మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశమైంది. స్థానిక తహసీల్దార్ గుర్తించిన అక్రమ నిర్మాణాలకు నోటీసులు అందజేస్తూ మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని పేర్కొన్నారు. ఇంటి స్థలం ఎలా వచ్చింది, స్థలం పత్రాలు అందజేయాలని సూచించారు. అక్రమ నిర్మాణాలపై రెండేళ్ల క్రితం నోటీసులు జారీ చేసినా ఆ తర్వాత ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఇటీవల చెన్నూర్‌లో అమృత్ 2.0 వాటర్ ట్యాంక్ నిర్మాణ పనుల భూమి పూజకు పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, వివేక్‌లతో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ హాజరయ్యారు. పక్కనే ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ నోటీసులు జారీ చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. రెవెన్యూ అధికారులు గుర్తించిన ప్రభుత్వ భూముల్లో చేపట్టిన నిర్మాణాలకు నోటీసులు జారీ చేశారు. అక్రమ నిర్మాణాలు కూల్చేస్తారా అని నిర్మాణదారులు ఆందోళన చెందుతున్నారు. ఒక వేళ కూల్చేస్తే మిగతా ప్రభుత్వ భూముల్లో నిర్మాణాల సంగతి ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది. గతంలో కిష్టంపేట పంచాయతీ పరిధి జాతీయ రహదారిని ఆనుకుని ప్రభుత్వ భూముల్లో 50 ఇళ్ల అక్రమ నిర్మాణాలను అప్పటి తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేశారు. కాగా, గెర్రెకాలనీలో 22 మందికి నోటీసులు జారీ చేయగా 10 మంది భూమికి సంబంధించిన కొనుగోలు పత్రాలు, ఇంటి నంబర్లు, ఇతర అనుమతి పత్రాలతో బదులు ఇచ్చారని మున్సిపల్ అధికారులు తెలిపారు. నోటీసు అందుకున్న వారంతా సంజాయిషీ పత్రాలు అందజేసిన తర్వాత కలెక్టర్‌కు నివేదిస్తామని కమిషనర్ గంగాధర్ తెలిపారు.

హత్యకేసులో నిందితుడి నుంచి కత్తి స్వాధీనం

తాంసి: భీంపూర్ మండలం పిప్పల్‌కోటి వాసి జానకొండ నారాయణ హత్యకేసులో ఇద్దరిని మహారాష్ట్రలోని మాండ్వి పోలీసులు రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. శుక్రవారం రాత్రి పోలీసులు నిందితుడు దేవన్నను పిప్పల్‌కోటి గ్రామానికి తీసుకువచ్చి క్రైమ్ సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. దేవన్న ఇంట్లో కత్తితోపాటు రక్తపు మరకలతో ఉన్న షర్టును స్వాధీనం చేసుకున్నారు. నారాయణ భార్య విజయలక్ష్మి కొన్ని ఆధారాలు దహనం చేసినట్లు గుర్తించారు. ఆ బూడిదను స్వాధీనం చేసుకున్నారు.

కుక్కల దాడిలో పొట్టేలు మృతి



పొట్టేలు కళేబరం

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామంలో శుక్రవారం కుక్కల దాడిలో ఓ పొట్టేలు మృతి చెందింది. మునిగెల నర్సయ్యకు చెందిన మేకలు, గొర్రెలు గ్రామంలోని పాకలో కట్టేసి ఉన్నాయి. దాదాపు ఐదు కుక్కలు మందపై దాడి చేయగా ఓ పొట్టేలుకు గాయమైంది. మేకల అరుపులు విన్న స్థానికులు వచ్చి కుక్కలను తరిమారు. గాయపడిన పొట్టేలును ఆటోలో బోథ్‌లోని వెటర్నరీ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. కాగా, గ్రామంలో కుక్కల బెడద నియంత్రించాలని గ్రామస్తులు కోరుతున్నారు.